# వానకోటు

ఊరి కొచ్చినప్పటినుంచీ సరదాబాబు కొకటే చిరాకుగా వుంది.

అన్నట్టు చిరాకు సంగతి అటుంచి, ముందుగా 'సరదా'ను గురించి చెప్పాలి.

సరదాబాబు అసలు పేరదిగాదు. డాక్టరీ చేసి, డాక్టరునే పెళ్ళాడి, ప్రస్తుతం విదేశాల్లో వున్న పినతల్లి అతడికి 'శరత్‌బాబు' అన్న నామకరణం చేసింది. చదువుకునే రోజుల్లో ఆమె శరత్ సాహిత్యమంటే ప్రాణాలు విడిచి పెట్టేస్తూ వచ్చిందట. విదేశాల్లో స్థిరపడి అర్జనవల్ల లభించే జీవన మాధుర్యాన్ని చవిచూచిన తర్వాత యిప్పుడా చేష్టలేవీ లేవుగానీ, అక్కగారి కుమారుడికి పెట్టిన పేరుమాత్రం ఆమె చిన్ననాటి సరదాకు ఒక చెరగని గుర్తుగా మిగిలి వుండిపోయింది.

స్కూల్లో అయ్యవార్లు చెప్పే చదువుల్లో సరదా ఏమాత్రమున్నూ లేదని శరత్‌బాబు కేనాడో తెలిసిపోయింది. మానేసేవాడే! కానీ యిందులో అతడికి తల్లిదండ్రుల సహకారం బొత్తిగా లేకపోయింది. తండ్రి బేతంచెర్ల శివారెడ్డి తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళన్నాడు. "ఒరే అబ్బీ! అదేం కుదరదు. నీపేరు స్కూలు రికార్డులో వుండాల్సిందే. నువ్వు గూడా హాస్టల్లోనే వుండు. చదివేదీ, చదవకపోయేదీ నీ ఓపికనుబట్టి నువ్వు చూసుకో! పరీక్ష హాల్లోనే నీకు వీలయినంత తోడ్పాటు దొరికేటట్టుగా నేను చూస్తాను. అంతకు మించితే పరీక్ష పేపర్ల వెనకంటే మనుషుల్ని పంపిస్తాను. సరేలే! నా పాట్లేవో నేను పడతానన్నానుగదా! నీకేం భయం?" అంటూ భరోసా యిచ్చేశాడు.

ఆ లైన్లమీద అప్రతిహతంగా సాగుతూ సాగుతూ వచ్చిన శరత్‌బాబు చదువుకు ఇంటర్మీడియట్ పూర్తయిందనిపించేటప్పటికి మాత్రం కాస్త బ్రేకు పడిపోయేటట్టు తోచింది.

అప్పుడైనా బియ్యేలోనో, బియ్యెస్సీలోనో సీటు సంపాదించడమైతే శివారెడ్డి కది పెద్దపనేంగాదు. కానీ ఆరు నూరయినా, నూరు ఆరయినా శరత్‌బాబును ఇంజనీరు చెయ్యాల్సిందేనని డాక్టరు మరదలు దగ్గరనుంచీ తాఖీదొచ్చి పడింది. అత్తెసరు మార్కులతో ఇంటరు గట్టెక్కిన శరత్‌బాబెక్కడ? ఇంజనీరింగులో సీటెక్కడ? ఇదేం గొడవరా బాబూ అని పాపం, శివారెడ్డి గాబరా పడిపోయాడు.

ఈ సందర్భంలో అనుభవజ్ఞులైన శ్రేయోభిలాషులు కొందరు శివారెడ్డికి 'రెస్క్యూ'గా వచ్చి నిలబడ్డారు. డబ్బు పెట్టగలిగితే దొరకని వస్తువేదీలేదని వాళ్ళ మూలంగా శివారెడ్డికి తెలిసొచ్చింది. ఈ చేత్తో డబ్బు ముట్టజెప్పి ఆచేత్తో కోరిన డిగ్రీ పుచ్చుకునే సావకాశాలను గురించి నోరూరేటట్టుగా, చవులుపుట్టేటట్టుగా వాళ్ళు శివారెడ్డికి వివరించారు.

బేతంచెర్ల శివారెడ్డికి డబ్బుకేం కొదవ? ఒక్క చింత మాసూలే పదివేలకు తగ్గదు. పసుపులో పదిహేనువేలు గ్యారంటీ, చెరకు, బెల్లం ధర పలికితే యాభైవేలదాకా ఇనప్పెట్టెలో వున్నట్లే. బిడ్డ చదువుకోసం ఒక లకారం తనది కాదనుకుంటే ఏం పోయింది?

ఏం పోలేదు, సీటు దొరికింది. శరత్‌బాబు బెంగుళూరుచేరి అక్కడొక ఇంజనీరింగు కాలేజీలో కుదురుకున్నాడు. ఇది రెండో సంవత్సరం.

పాతబస్తీనుంచి మహానగరానికి మకాం మార్చిన తర్వాత గడచిన ఏడాది కాలముందే, అది శరత్‌బాబు జీవితంలో కీలకమైన ఘట్టమని ఒప్పుకోవాలి. లోకాన్ని సమ్మోహితం

చేయడానికి తన కందుబాటులో వున్న ఏకైక సాధనం డబ్బేనన్న పరమ రహస్యం ఈ వ్యవధిలో అతడికి అవగతమైపోయింది. నూరుమంది మనుషుల్లో నుంచి ఒక్కణ్ణి ప్రత్యేకించి చూపగలిగేది అతడి వేషమేనని తెలుసుకున్నాడు. అంతటితో దుస్తులపైన, దర్జీలపైన చేయగలిగినన్ని ప్రయోగాలు చేసిచూశాడు. బెల్‌బాటం పాంట్లు, పొట్టిచేతుల స్లాకులు, బిగువైన జీన్ షరాయిలు, టీషర్టులు, వదులుగా పైజామాలు, జిగేల్మనిపించే అల్లికపన్లతో గూడిన జుబ్బాలు, రంగురంగుల స్టిక్కర్లు, కోట్లు, టైలు.. అంతేనా? పాదరక్షల్లో, సులోచనాల్లో, శిరోజాలంకరణలో అంతటా వైవిధ్యమే! పూటపూటకూ ఒక వేషంతో, గంట గంటకూ ఒక భంగిమలో అతడు కనిపించడం పరిపాటి అయిపోయింది. అసలు పేరు మరుగునబడి, అతడు సరదా బాబుగా స్థిరపడిపోయింది కూడా అప్పుడే.

అయితే వేసవి సెలవుల అనంతరం తిరిగి వెళ్ళేటప్పటికి తన చుట్టూరా నెలకొన్న కాలేజీ వాతావరణంలో సరదా బాబుకు కొంత మార్పు కనిపించింది. ఎగతాళిగా చూడ్డం, గుసగుసలాడుకోడం, కిసుక్కున నవ్వుకోడం, ఏమిటిదంతా? సరదా బాబుకు భలే కోపమొచ్చింది. ఓయబ్బో, వీళ్ళ విరగబాటుకు కారణమేమిటో తనకు తెలియకపోయిందా? ఏం లేదు. మొదటి సంవత్సరం పరీక్షలో తనకన్ని సబ్జెక్టులలోనూ సింగిల్ డిజిట్టు మార్కులే వచ్చాయట! వస్తే వచ్చాయి. వీళ్ళమాదిరిగా తనకేం చదువుకు తీరాలన్న కక్కుర్తిలేదే! బోడి యింజనీరింగు! ఇది చదివితే ఎంత? చదవకపోతే ఎంత? పులికొక పొద మాసిపోతే నష్టమా?

తోడి విద్యార్థుల సాహచర్యంలో యిమడలేక తనకుతానే లీవు "అవెయిల్" చేసుకుని, దసరా సెలవులకింకా ఒక నెలరోజులుందనగానే స్వగ్రామానికి చెక్కేశాడు సరదాబాబు.

డీలక్స్ బస్సులో వచ్చి చిత్తూరులో దిగాడు. అక్కడినుంచి ఒక "నాన్‌స్టాప్" లో పీలేరుకు ప్రయాణం చేశాడు. పీలేరునుంచీ బేతంచెర్లకు ముప్పైమైళ్ళు. ఆ రూటుపైన ఒక డొక్కుబస్సు రోజుకు మూడుసార్లు రాకపోకలు సల్పుతుంది.

సరదా బాబులో చిరాకు రగులుకోడానికి అంకురార్పణ జరిగింది ఈ పీలేరులోనే. కాఫీ కోసమని ఒక హోటల్లోకి వెళ్తే కుర్రాడు గ్లాసులో మంచినీళ్ళు తెచ్చి పెట్టాడు. బట్టలుతికిన నీళ్ళకుమల్లే అవి మురికిగా వున్నాయి. నోట్లో పోసుకుంటే యింపితం గాని రుచి, కుండలో కొద్ది రోజులు మురిగినట్టుగా అదేమిటో చెడు వాసన గూడా!

"ఛీఛీ, యివేం నీళ్ళు?" అన్నాడు సరదా బాబు.

"మంచి మాటేలే! ఈ నీళ్ళయినా యిక్కడికెలా వొచ్చాయని అడగవే? రెండు మైళ్ల నుంచీ పీపాల్లో తీసుకొస్తావుండాం? ఏట్లో నీళ్ళు పారి మూడేండ్లయింది. ఊళ్ళో బాయిలన్నీ వట్టిపోయినాయి. తాగేందుకు మంచినీళ్ళు సప్లయిచేయలేక నాలుగైదు ఓటల్లు గూడా మూతబడిపోయినాయి. ఏ వూరి నించీ వొస్తావుండావో ఏమో? మా కష్టాలు నీకేం తెలుస్తాయి?" అంటూ హోటలు కుర్రాడు నొచ్చుకున్నాడు.

బస్సులో కొందరు ప్యాసెంజర్లు సరదా బాబును గుర్తు పట్టేశారు. సదుపాయంగా కూచోడానికి కిటికీ ప్రక్కన సీటు కల్పించారు. ఒక బొద్దు మీసాల ముసలాయన "ఏం నాయనా! నువు బేతంచెర్ల శివారెడ్డి కొడుకువి గదూ?" అంటూ పరిచయ ప్రసంగం గూడా మొదలెట్టేశాడు "అద్సరే! బెంగుళూరులో నంట గదూ నువు చదువుకునేది? అక్కడ్నే వుండిపోరాదా? ఇక్కడేముందని వొచ్చినావు? చూడు, చేన్లల్లో శనగచెట్లు మాడిపోయింది. చెరుకు తోటకు తడి విడిచిపెట్టేస్తిమి. వరిపైర్ల మాట చెప్పనే అక్కర్లా.

పంటికిందికి పచ్చిక దొరక్క గొడ్లకు డొక్కలెండిపోయినాయి. పందిలిపైన కసువు పోగులేదు. ఒకటి అరా బోరింగు బావులుండబట్టి సరిపోయింది గానీ లేకుంటే తాగే నీళ్ళు గూడా లేక ఏ పరాయిదేశమో వెళ్ళిపోయి వుందుము.”

సరదా బాబుకు బీద ఏడుపు లంటే బొత్తిగా నచ్చవు. అతడు ముఖం చిట్లించుకుంటూ “ఇక్కడెప్పుడూ యిదే గోడు! బెంగుళూర్లో నయితే ప్రతిరోజూ వానే!” అన్నాడు.

“నాయన్నాయనా! ఆ మాట నిజమే. మేం గూడా పేపర్లు చూస్తా వుంటాం గదా! అక్కడెక్కడో ఉత్తరదేశంలో వరదలొస్తాయి. తూరుపు సీమలోయలో ఊళ్ళు మునిగిపోతాయి. అంతెందుకు మన 'ఆంధ్రా'లో గూడా పెద్ద నదులన్నీ పొంగిపొర్లి పోతాయి. కానీ రాయలసీమలో మాత్రం చినుకుపడదు. క్రమంగా మూడేండ్లు వానలు కురిస్తే ఆ తరువాత అయిదేండ్ల పొడుగునా కరువే! ఏం చెయ్యాలి? అంతా మనమడిగొచ్చిన రాత!”

'నీలాంటి ఏడుపుగొట్టు ముఖాలుండడం వల్లనే రాయలసీమలో వానల్లేనిది!' బిగ్గరగా అరిచి చెప్పాలనిపించింది సరదాబాబుకు. మనసులోని చిరాకు మరింతగా ఉరకలెత్తింది. ఇంతకాలంగా ఎట్లా జరిగితే తనకేంగానీ, యిప్పుడు మాత్రం అర్జంటుగా వాన కావాలి. వానలో సరదాగా తిరగాలని తాను వంద రూపాయలు పెట్టి వానకోటు కొంటే వాన రాకుండా పోవడమా? అదేం కుదరదు. వాన కురవాలి. కురుస్తుంది. కురవ కెక్కడపోతుంది?

ఇంటికొచ్చి చేరుకున్నాడు. తండ్రికెప్పుడూ వ్యవహారాలతో, పంచాయితీలతో సరిపోతుంది. తల్లి కింటి పనులు చక్కబెట్టుకోవడమే తలకుమించిన పని. సరదా బాబుతో తీరికగా బాతాఖానీ కొట్టుకోగలవాడు కొండారెడ్డి తాత ఒక్కడే! ఆయన శివారెడ్డికి పినతండ్రి. బిడ్డల్లేక శివారెడ్డినే దత్తు చేసుకున్నాడు. రెండు పాయలుగా చీలిన ప్రవాహం మళ్ళీ కలిసినట్టుగా ఆస్తులు రెండూ కలిశాయి. క్రింది హాల్లోని వాలుకుర్చీ కొండారెడ్డి తాత సింహాసనం. ఆయన తనకుతానుగా గృహపాలకుడి హోదా అంటగట్టుకుంటాడు. వాస్తవానికి ఆయన చేసేది ద్వారపాలకత్వం.

“ఏం తాతా! మన ఊళ్ళో వానలే పడవా?” అన్నాడు సరదా బాబు.

“ఒరే నాయనా! అప్పుడప్పుడూ యిట్లా వానల్లేకపోతేనే మంచిది. ఎందుకంటావా వానలు కురిసి, వరదలొచ్చి, చెరువులు నిండి దేశం సుభిక్షంగా వుంటే కూలిపనికి కొరతుండదు. ముప్పూటలా కడుపు నిండితే సన్నకారు జనానికి కళ్ళు నెత్తిపైకొస్తాయి. ఒక పక్క కడుపు మాడుతూ వుంటే గాని వాళ్ళు చెప్పిన మాట వినరు. కరువొచ్చిందనుకో! గింజాగిత్రా బదులిప్పించమనీ, అప్పో సప్పో యిచ్చి ఆదుకోమనీ, నగానత్రా కుదువపెట్టుకోమనీ మనచుట్టూ దేబిరిస్తారు. మనకు తెలివనేదుంటే దీపముండేప్పుడే యిల్లు సర్దుకోవాల. బావులు, ఇండ్లు కట్టుకోవాలన్నా, మళ్లకు చెరువుమట్టి తోలించుకోవాలన్నా, యిట్లా వానల్లేని కాలమైతేనే మేలు. ఇదంతా నువ్వెప్పుడు తెలుసుకుంటావో...”

'కాదులే తాతా! నీకేంతెలియదు. నేను కొత్తగా వానకోటు కొనుక్కున్నాను. వాన లేనిదే వానకోటు తొడుక్కోడానికి వీల్లేదు. అందుకని అత్యవసరంగా నాకిప్పుడు నాలుగు దుక్కుల వాన కావాలి' అని చెబితే ఈ ముసలాయన కేమర్థమవుతుంది?... సరదా బాబు తలపులన్నీ అతడి వానకోటు పైకి వెళ్ళి మూగిపోతున్నాయి. ఊరికి రావడానికి రెండు రోజుల ముందుగా కొన్నది. గాజు పలకకు, నూలు బట్టకు మధ్యస్థంగా ప్లాస్టిక్కుతో

రూపొందింది. ఎంత నునుపో! ఈగ వాలినా జారిపోవలసిందే. మెడ దగ్గరనుంచీ పాదాలదాకా గుండీలు పెట్టుకోవచ్చు. తలపైన టోపీలా అమర్చుకోవచ్చు. ఒంటిపైన చినుకుపడే అవకాశమే లేదు. తొడుక్కుని వానలో తిరిగితే ఎంత సరదాగా వుంటుందో! ఛీ ఛీ! ఈ రాయలసీమలో వానలే పడవే!... సరదా బాబుకు ఆకాశం వైపు చూడ్డమే పనైపోయింది.

ఈ ప్రతీక్షల్లో వారం పదిరోజులు భారంగా దొర్లిపోయాయి.

ఒక రోజు ఉదయం నిద్రలేచి ఈవలికి వచ్చేసరికి నీళ్ళు చల్లినట్టుగా నేల తడిసివుంది. చెమ్మగాలి రివ్వురివ్వున వచ్చి చర్మానికి సోకింది. సరదాబాబు హాల్లోకి పరుగెత్తుకుంటూ వెళ్ళి "ఏం తాతా! రాత్రి వానొచ్చిందా?" అని వాకబు చేశాడు. "ఆఁ, ఏం వానలేరా! ఒక జల్లొచ్చిపోయింది" అన్నాడు కొండారెడ్డి తాత.

'జల్లొచ్చిపోయిందిగదా! జడివాన మాత్రం రాకపోతుందా?'

ఒక మధ్యాహ్నం భోజనం చేసి భుక్తాయాసంతో పడుకున్న సరదాబాబు ఆలస్యంగా నిద్రలేచాడు. గదంతా చీకటిగావుంది. గడియారంవైపు చూశాడు. గంట నాలుగున్నరే! అయితే యిలా వుందేమిటి? కిటికీలో నుంచి వెలుపలికి చూశాడు. ఆకాశాన మదపుటేనుగుల్లా, నడగొండల్లా నల్లటి మేఘాలు కదిలి పోతున్నాయి. సరదా బాబుకు పరమానందమైపోయింది. తటాలున పెట్టెతీసి వానకోటు పైకి తీశాడు. ఎలాగైనా సిద్ధ సంకల్పుడే! అంతింత లావు వాన చినుకులు జల్లుజల్లున రాలి ఎండకు దస్సిపోయిన నేల తల్లిని ఆపురావురుమంటూ ముద్దెట్టుకుంటున్నాయి.

తొందరతొందరగా కోటు తొడుక్కున్నాడు. అద్దం ముందు నిలబడి తనివి తీరేటట్టుగా తన కొత్త వేషాన్ని చూచుకున్నాడు. చరచరా హాల్లోకి వచ్చేశాడు.

"ఒరే యొరేయ్! ఏందిరా నాయనా! ఏం వేషం అది?"

సరదాబాబు కాళ్ళకు బ్రేకులు పడిపోయాయి.

"నీకు పుణ్ణెముంటుందిరా తండ్రీ! ఆ ముస్తాబులో మాత్రం బయటి కెళ్ళొద్దు. ఇదేం బెంగుళూరా? అక్కడైతే సిమెంటు రోడ్లు, పాలుబోసి పాలెత్తుకోవచ్చు. ఇక్కడట్లాకాదే! వట్టి బురద, రొంపి, రొచ్చు. అదలా వుండనీ! చూచినవాళ్లు పగలబడి నవ్వుకోరా? వెళ్లు వెళ్లు, ముందా తొడుగు విప్పిపెట్టు."

సరదాబాబుకు ఉక్రోషం ముంచుకొచ్చింది. వాలు కుర్చీతోసహా అలాగే ఆ ముసలాయన్ను వానలోకి దొర్లించేస్తే బాగుండు ననిపించింది. కానీ ఒక క్షణం ఆగి ఆలోచించేసరికి ఆయన మందలింపులోనూ కాస్త నిజం లేకపోలేదని తోచింది. చటుక్కున యింకొక కొత్త ఊహ తట్టడంతో అతడు లోపలికి వెళ్ళినట్టే వెళ్ళి గబగబా మిద్దె మెట్లెక్కి డాబాపైకి వచ్చేశాడు.

అక్కడక్కడ చెట్లు, వాటి నడుమ గుడిసెలు, జోబిడీలు, సపారులు, పూరిళ్ళు, కొట్టాలు మొదలైనవి అడివిలో సమావేశమైన క్షుద్రజంతువుల్లా వున్నాయి. మధ్యగా మృగరాజంలాంటి మేడ, ఆ మేడ దాబాపైన పిట్టగోడ కానుకుని నిల్చున్నాడు సరదాబాబు. కొండలపైన పరదాలు వ్రేలాడదీసినట్టు, తోపులపైన చీకటి ముసుగులు కప్పినట్టు, ఊరు వూరంతా నత్తగుల్లలా తనలోకి తాను ముదుచుకపోయేటట్టు వాన కురుస్తోంది. మేతకు వెళ్ళిన గొడ్డుగోదలు ఎవరో వెన్నంటి తరిమినట్టుగా పరుగెత్తుకొస్తున్నాయి. వాటి పరుగందుకోలేక వెనుకబడి, తడిసి ముప్పందుమైపోయి వచ్చిన పశువులకాపర్లు 'హేయ్, హేయ్' అని

అదిలిస్తూ గొడ్లను పందిళ్ళ క్రింద గుంజలకు కట్టేస్తున్నారు. వాన నీళ్ళ ఉరవడితో వీధివీధంతా కాలవగా మారిపోయింది. ఎక్కడివాళ్ళక్కడ గూళ్ళలాంటి యిళ్లలో దూరుతున్నారు. చూస్తూ చూస్తూ వుండగానే ప్రాణుల సంచలనం మాటుమణిగి పోవడంతో సరదాబాబులో మళ్ళీ చిరాకు మొదలైంది. వాన కురిస్తే మాత్రం సరిపోయిందా? అందులో "ఎంటర్ టెయిన్" చేసేదేదైయినా వుండొద్దా?

సరిగ్గా ఆ సందర్భంలో వీధి కటువైపున, పది గజాల దూరంలో వున్న మట్టి మిద్దెలోనుంచి కేకలు వినిపించాయి, "నాయనోయ్, అమ్మోయ్! తూము తీసినట్టుగా నీళ్ళు దూరేత్తావుండాయి" అంటూ ముగ్గురు పిల్లలు బిలబిలా బయటికి దూసుకొచ్చి బిక్కుబిక్కుమంటూ వసారాలో నిలబడిపోయారు.

సరదాబాబులో ఆసక్తి చిగురెత్తింది.

మేడకెదురుగా వున్న ఆ మట్టిమిద్దె దరిద్రానికి మారుపేరు. మట్టినేల, మట్టిగోడలు, పైకప్పుగూడా మట్టే. పిట్ట గోడలుండవు గనుక బోసిగా సమాధిలా వుంటుంది. కిటికీల్లేవు గనుక లోపల గాలి కదలదు. చీకటి గుయ్యారం. అందులో మనుషులెలా జీవిస్తున్నారో తెలియదు. అసలందులో నివసించేవాళ్ళు మనుషులే ననుకోడానికి మనస్కరించదు. "దెష్ట పీనుగులు" అంటుంటుంది అమ్మ. "మొండి ముండావాళ్ళు" అంటుంటాడు కొండారెడ్డి తాత. కూతుళ్ళనెవడు కనమన్నాడు? కట్నాలిచ్చి వాళ్ళకెవడు పెళ్ళిళ్ళు చెయ్యమన్నాడు? అందుగ్గాను అప్పులిచ్చినప్పుడు మాత్రం బేతంచెర్ల శివారెడ్డి మంచోడే! అప్పుడు తీర్చలేకపోతే అందుకెవడిది జవాబుదారీ? అయిదెకరాల మడికయ్యలో మచ్చుకయిదు సెంట్లు మిగుల్చుకోకపోయినా బింకం చావదే! నాన్నగారు శతపోరుతున్నారు. "ఒరే గంగిరెడ్డీ! ఊరు శివారులో నీకు జాగా చూపిస్తాను. అక్కడొక యిల్లేసుకో! ఈ జాగా నాకు వదిలి పెట్టు, నా పశువుల కొట్టాలు నేనిక్కడికి మార్చుకుంటాను" అని. వినిపించుకోడే? వీడి బ్రతుక్కు ఊరిమధ్యన వుట్టి గట్టుకుని వూరేగాలంటాడు. పూటపూటకూ తిండికి లాటరీ! కట్టుకున్న బట్ట విప్పితే మారు బట్ట వుండదు. వరసగా నిలబడితే దిష్ట బొమ్మల ప్రదర్శనమే. అదిగో... అనుకుంటూ వుండగానే వచ్చేశాడు...

నిజమే. గంగిరెడ్డి దిష్టిబొమ్మలాగే వున్నాడు. నడుముకు నాలుగుమూర్ల పంచ చుట్టుకున్నాడు. చెంగులు పైకిదీసి మొలతాడు సాయంతో గోచిపెట్టుకున్నాడు. శరీరంపైన అంతకు మించిన ఆచ్ఛాదనం లేదు. లోపలనుంచి తీసుకొచ్చిన నిచ్చెనను పైకప్పు కానించాడు. "ఉండుండు. నిచ్చెనెక్కడైనా జారేను!" అంటూ యింటావిడ బయటికి వచ్చేలోగా నాలుగు మెట్లెక్కేశాడు. పైకప్పుకు అంచుగా పెట్టిన యిటుకరాళ్ల వరసలోనుంచి ఒక రాయి జారి దభేలున క్రిందపడింది. నిచ్చెన ఒకవైపుకు ఒరిగింది. ఎక్కడ పడిపోతుందోనని గంగిరెడ్డి క్రిందికి దూకేశాడు. ఆ దూకడంలో తలపైన వేసుకున్న గోనె సంచి జారి యింటి ముందర నిలచిన నీటిలో పడిపోయింది. గంగిరెడ్డిగూడా పడిపోవలసిందే గాని భార్య గట్టిగా పట్టేసింది.

'అరరే, కొంచెంలో తప్పిపోయిందే!' సరదాబాబు కాస్త యిబ్బందిగా ఫీలయ్యాడు. తన సరదాకు విఘాతం కలిగినప్పుడల్లా అతడికి చిరాకుగానే వుంటుంది.

"చెప్తే వినిపించుకోవే! కురిస్తే కురవనీలే! వాన వెలిసిన తర్వాత చూసుకోవచ్చు. నువ్వు లోపలికి పద" అంటూ నిచ్చెన కడ్డంగా నిలబడింది గంగిరెడ్డి భార్య.

"తప్పుకోయే యెర్రి మొగమా! ఇల్లంతా మడుగైపోయినాక పైకెక్కి ఏం చేస్తావు?" అంటూ రెక్కబట్టుకుని భార్యను ప్రక్కకుతోసి గంగిరెడ్డి నిచ్చెన నందుకున్నాడు. భార్య నిచ్చెనను తొక్కిపట్టుకుంది. జాగ్రత్తగా మెట్లెక్కి కప్పు మీదికి చేరుకున్నాడు. అప్పటికే కప్పుమీద బెత్తెడు లోతు నీళ్ళు నిలిచిపోయాయి. పైకి వెళ్ళగానే తూముదగ్గర చేరుకున్న చెత్తా చెదారం తీసేశాడు. గొట్టంలో నుంచి నీళ్ళు జోరుగా క్రిందికి దూకేస్తున్నాయి.

ఒకటే స్థాయిలో దరువు మ్రోగినట్టుగా వాన కురుస్తోంది.

గంగిరెడ్డి కట్టుకున్న పంచె బాగా తడిసి బరువెక్కిపోయింది. తలపై నుంచి జారిన వర్షధారలు కనుగొలుకుల్లో పడడం వల్ల కళ్లు మూసుకుపోతున్నాయి. కప్పు పైన ఎక్కడెక్కడ బొరియలేర్పడిందీ తెలియడం లేదు.

ఏం చేయటానికి తోచక పిచ్చెక్కినవాడిలా అటూ యిటూ పరుగులు తీశాడు. ఒకచోట నీళ్ళు తీసిపోయి చిన్నలంకలా మట్టికనిపించింది. "ఇక్కడ కురుస్తోందా?... యిక్కడ?" అని గొంతెత్తి అరుస్తూ, కాలితో తొక్కి చూడబోయాడు. పాదం జర్రున జారింది. ఎవరో ఎత్తి కుదేసినట్టుగా బురదనీటిలో బోర్లగిలపడిపోయాడు.

'భలే భలే, బాగా జరిగింది!' పడుచుగుర్రం సకిలించినట్టుగా నవ్వసాగాడు సరదాబాయి. వాన హోరుతో పోటీపడినట్టుగా అతడి నవ్వు యింకా యింకా సుళ్ళు తిరుగుతూనే వుంది.

తూలి పడిపోయిన తాకిడికి ఒళ్ళంతా దిమ్మెక్కి పోయినట్టయింది గంగిరెడ్డికి. వెంటనే లేవలేకపోయాడు. బురద పులిమినట్టున్న ముఖాన్ని పైకెత్తాడు. ఒక చేత్తో కప్పును గట్టిగా పట్టుకుని లేవడానికి ప్రయత్నించాడు, మొలతాడు పాతది. పుటుక్కుమన్న చప్పుడు అతనికి వినిపించలేదు. ఎట్లాగో, ఎంతో పూనికపైన మెల్లగా లేచి నిల్చున్నాడు. ఇంకా తన స్పృహలోకి పూర్తిగా రాలేదతను. ఎందుకో మరి, పడి లేచిన మీదట ఒళ్ళు తేలికైపోయినట్టుంది. కారణమేమిటో కొద్ది క్షణాల్లోనే తెలిసొచ్చింది. ఒంటిపైన నూలుపోగన్న మాటలేదు.

రాయి పెట్టి కొట్టగా పగిలిన విద్యుద్దీపంలా సరదాబాబు నవ్వు ఆగిపోయింది. ఎ...ఎ... ఏమిటది? గంగిరెడ్డి రూపమా? ఆదిమ మానవుడి ఆకారమా? షాకు తిన్నట్టుగా అతడి శరీరం కొయ్యబారిపోయింది. ఒక క్షణం... రెండు క్షణాలు...మూడో క్షణాన అతడు వెనుదిరిగి తుఫాను గాలిలా క్రిందికి కొట్టుకపోయాడు.

గదిలోకి వెళ్ళగానే వానకోటు తీసి ఓ మూలకు గిరవాటు పెట్టాడు.

బేతంచెర్లలో వుండి వుండీ వానజల్లులు పడుతున్నాయి. కానీ ఆ తర్వాత సరదాబాబు వానకోటును తాకి వుంటే ఒట్టు!

♦ 'జ్యోతి' దీపావళి సంచిక - 1981 ♦